PRGI NO:TGTEL/26/A0383
డైనమిక్
# జనం వాయిస్
తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM
తెలంగాణ బుధవారం 07-10-2026 సంపుటి: 01 సంచిక : 269 పేజీలు : 12

## ప్రతిపక్ష స్థాయికి కాక్రోచ్‌లు..!

ప్రధాన పార్టీలకు సోషల్ మీడియా ఉద్యమాలే దిక్కు.
ప్రజా సమస్యలపై పోరాటాలు కరువు.
ఇతరుల అజెండాల చుట్టూనే రాజకీయం.
కాంగ్రెస్ సహా విపక్షాల తీరుపై రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ.




**జనం వాయిస్, న్యూఢిల్లీ, అక్టోబర్ 6:**

దేశ రాజకీయాల్లో ప్రధాన ప్రతిపక్ష పార్టీల పరిస్థితిపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒకప్పుడు ప్రజా సమస్యలపై స్వతంత్రంగా ఉద్యమాలు నిర్వహిస్తూ ప్రభుత్వాలను నిలదీసిన పార్టీలు.. ఇప్పుడు ఇతర సంస్థలు, సోషల్ మీడియా వేదికలు, డిజిటల్ ఉద్యమాలపై ఆధారపడుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. వందేళ్లకు పైగా చరిత్ర ఉన్న కాంగ్రెస్ సహా పలు ప్రతిపక్ష పార్టీలు తమదైన రాజకీయ అజెండాను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో విఫలమవుతున్నాయనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని విధానపరంగా ప్రశ్నించాల్సిన స్థానంలో.. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న అంశాల వెంట పరుగులు తీస్తున్నాయని విమర్శలు వస్తున్నాయి. ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో ప్రజలను సమీకరించి ఉద్యమాలు నిర్మించాల్సిన పార్టీలు, ఇతరుల ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాలకు మద్దతు ఇవ్వడానికే పరిమితమవుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో దేశ రాజకీయాల్లో అధికార పక్షానికి ప్రత్యామ్నాయంగా బలమైన ప్రతిపక్ష వేదిక ఎక్కడ అన్న ప్రశ్న తలెత్తుతోంది. ఇటీవల ముంబైలోని శివాజీ పార్క్, దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి జ్ఞానేశ్ - మిగతా 2 లో...

## మందుబాబుల్లో తెలంగాణ అగ్రస్థానం

- 15 ఏళ్లకే మద్యం అలవాటు.
- గ్రామీణ ప్రాంతాల్లో మరింత అధికం.



## రూ.80కి చేరిన సన్నబియ్యం

- నాలుగు నెలల్లో 25 శాతం పెరిగిన ధరలు.
- సామాన్యుడి వంటింటిపై పెనుభారం.
- పొరుగు రాష్ట్రాలకు తరలిపోతున్న సన్నధాన్యం.
- అక్రమ నిల్వలు, అక్రమ రవాణాపై ఆరోపణలు.
- చర్యలు తీసుకోవాలని వినతులు.



**జనం వాయిస్, నల్గొండ, అక్టోబర్ 6:**

సన్నబియ్యం ధరలు సామాన్యుడికి చుక్కలు చూపిస్తున్నాయి. కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే కిలో సన్నబియ్యం ధర ఏకంగా 25 శాతం మేర పెరిగింది. గతంలో కిలో రూ. 50 నుంచి రూ. 55 మధ్య ఉన్న ధరలు ప్రస్తుతం రూ. 65 నుంచి రూ. 83 వరకు చేరాయి. తక్కువ నాణ్యత కలిగిన సన్నరకం బియ్యం సైతం కిలో రూ. 60కి పైగా పలుకుతుండటంతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు భారం పడుతోంది. వర్షాభావ పరిస్థితులు, ధాన్యం దిగుబడి తగ్గడం, యాసంగి సాగు విస్తీర్ణం తగ్గిపోవడం వంటి కారణాలతో సన్నరకం ధాన్యం లభ్యత తగ్గినట్లు తెలుస్తోంది. దీంతో మార్కెట్‌లో బియ్యం ధరలు పెరుగుతున్నాయి. తెలంగాణలో పండుతున్న సన్నరకం ధాన్యానికి కర్ణాటక, - మిగతా 2 లో...

## గోషామహల్‌లో ముస్లిం ఓట్ల తొలగింపునకు కుట్ర: అసదుద్దీన్ ఒవైసీ

ముస్లిం ఓటర్లే లక్ష్యంగా కుట్ర జరుగుతోందన్న ఒవైసీ.
పెద్ద సంఖ్యలో ఫారం-7 దరఖాస్తులు సమర్పిస్తున్నారని ఆరోపణ.
వారిపై కేసులు నమోదు చేయాలని ఒవైసీ డిమాండ్.


2

## 4 లక్షలు తీసుకుంటూ ఒకరు.. లక్ష తీసుకుంటూ మరొకరు.

ఏసీబీ చేతికి చిక్కిన ఇద్దరు మహిళా అధికారులు.
రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌వో స్వర్ణకుమారి అరెస్ట్.
రూ. లక్ష లంచం తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ.
జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ సునీత అరెస్ట్.
నిర్మాణ అనుమతుల కోసం రూ.4 లక్షలు తీసుకుంటుండగా పట్టివేత.



2

## కాంగ్రెస్‌లో కొత్త కుర్చీలాటకు తెరలేపుతున్నారా?

- బీసీ సీఎం నినాదం వెనుక.
- రేవంత్ నాయకత్వంలో ప్రభుత్వం సాగుతుండగా కొత్త చర్చ ఎందుకు?
- బలమైన ప్రజాదరణ లేకుండానే ముఖ్యమంత్రి పదవిపై ఆశలేలా?
- పార్టీ ఐక్యతను దెబ్బతీసేలా వర్గపోరుకు ప్రోత్సాహమా?
- ముందుగా పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకురావడంపై దృష్టి పెట్టాలని సూచనలు.

**జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబర్ 6:**

తెలంగాణ కాంగ్రెస్‌లో బీసీ ముఖ్యమంత్రి నినాదం కొత్త రాజకీయ చర్చకు దారితీస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం కొనసాగుతున్న సమయంలో పార్టీలోని కొందరు నేతలు అకస్మాత్తుగా బీసీ ముఖ్యమంత్రి అంశాన్ని తెరపైకి తీసుకురావడంపై పార్టీ వర్గాల్లోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వాన్ని - మిగతా 2 లో...



## మాజీ మావోయిస్టులను తమ పార్టీలోకి ఆహ్వానించిన కవిత

ప్రజాసేవ చేసేందుకు మాజీ మావోలు తమ పార్టీలో చేరాలన్న కవిత.
వేములవాడ ఆలయంలో మేత, నీరు లేక గోవులు మరణిస్తున్నాయని ఆవేదన
కాంగ్రెస్ ప్రభుత్వం దిశానిర్దేశం కోల్పోయిందని వ్యాఖ్య.


2

## జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు హైకోర్టు నోటీసులు.

గాంధీ జయంతి నాడు మాంసం దుకాణాల మూసివేతపై వివాదం.
ఫిబ్రవరిలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను ఉల్లంఘించారని పిటిషనర్ ఆరోపణ.
కమిషనర్‌పై చర్యలు తీసుకుని, రూ.50,000 జరిమానా విధించాలని అభ్యర్థన.


2

## సింగరేణి కార్మికులకు పండగ కానుక.. ఒక్కొక్కరికి రూ.1.10 లక్షల బోనస్

సింగరేణి కార్మికులకు దసరా, దీపావళి కానుకగా బోనస్.
సోషల్ మీడియా వేదికగా వెల్లడించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి.
సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం రూ.60 వేల కోట్లు చెల్లించాలని విజ్ఞప్తి.


2

PRGI NO:TGTEL/26/A0383
దినపత్రిక జనం వాయిస్ తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM

# ప్రతిపక్ష స్థాయికి కాక్రోచ్‌లు..!

- మొదటి పేజీ తరువాయి..

కుమార్ రాజీనామా చేయాలంటూ జరిగిన నిరసనలు ఈ చర్చకు మరింత ఊతమిచ్చాయి. ఎన్నికల సంఘం వ్యవహారశైలిని ప్రశ్నిస్తూ ఇండియా కూటమిలోని పలు పార్టీలు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నాయి. అయితే ఈ నిరసనలను సోషల్ మీడియాలో యువత, జెన్–జీ ఉద్యమాలుగా ప్రచారం చేస్తున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో పాల్గొంటున్న వారిలో రాజకీయ పార్టీల అనుబంధ విద్యార్థి, యువజన విభాగాల కార్యకర్తలు కూడా ఉన్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నేటి యువతలో ఎక్కువమంది ఉద్యోగాలు, కెరీర్, నైపుణ్యాలు, స్టార్టప్‌లు, భవిష్యత్ అవకాశాలపై దృష్టి సారిస్తున్నారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అలాంటి పరిస్థితుల్లో కొందరు డిజిటల్ ఇన్‌ఫ్లుయెన్సర్లు, సోషల్ మీడియా ప్రచారాలను ఆధారంగా చేసుకుని జరిగే కార్యక్రమాలను పెద్ద ప్రజా ఉద్యమాలుగా చూపించే ప్రయత్నం జరుగుతోందనే విమర్శలు వస్తున్నాయి. సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్న ప్రతి అంశాన్ని రాజకీయ ఉద్యమంగా మార్చడం ద్వారా ప్రతిపక్షాలు తమ రాజకీయ లోటును పూడ్చుకునే ప్రయత్నం చేస్తున్నాయనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వాన్ని విధానపరంగా నిలదీయడం, పాలనలోని లోపాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, నిరుద్యోగం, ధరలు, రైతులు, ఉద్యోగులు, విద్య, ప్రజా సంక్షేమం వంటి అంశాలపై బలమైన ఉద్యమాలను నిర్మించడం వంటి బాధ్యతలను ప్రతిపక్షాలు సమర్థంగా నిర్వహించడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఎన్నికల సంఘం, ఈవీఎంల అంశాల చుట్టూనే రాజకీయ పోరాటాన్ని పరిమితం చేయకుండా ప్రజల రోజువారీ జీవితానికి సంబంధించిన సమస్యలను ప్రధాన అజెండాగా తీసుకోవాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తమ రాజకీయ భవిష్యత్తును కాపాడుకోవాలంటే ప్రతిపక్ష పార్టీలు ఇతరుల అజెండాల వెంట నడవడం కాకుండా స్వయంగా ప్రజల్లోకి వెళ్లాల్సిన అవసరం ఉందని రాజకీయ విశ్లేషకులు సూచిస్తున్నారు. ప్రజల సమస్యలను గుర్తించి, వాటిపై నిరంతర పోరాటాలు నిర్వహించి, ప్రభుత్వాన్ని విధానపరంగా నిలదీసినప్పుడే ప్రతిపక్షంగా తమ పాత్రను బలోపేతం చేసుకోగలవన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం సోషల్ మీడియా ఉద్యమాల చుట్టూ ప్రతిపక్షాల రాజకీయం తిరుగుతుండటంపై రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ కొనసాగుతోంది.

# మందుబాబుల్లో తెలంగాణ అగ్రస్థానం

**జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబర్ 6:**

మద్యం వినియోగంలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. 15 ఏళ్లు పైబడిన పురుషుల్లో ఏకంగా 43.9 శాతం మంది మద్యం సేవిస్తున్నట్లు జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే తాజా గణాంకాలు వెల్లడించాయి. దేశవ్యాప్తంగా ఇదే వయసు పురుషుల్లో మద్యం సేవించే వారి సగటు 18.9 శాతంగా ఉండగా.. తెలంగాణలో ఈ సంఖ్య రెండింతలకు పైగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది.

### రాజస్థాన్ రెండో స్థానం

మద్యం వినియోగంలో తెలంగాణ తర్వాత రాజస్థాన్ రెండో స్థానంలో ఉంది. ఆ రాష్ట్రంలో 15 ఏళ్లు పైబడిన పురుషుల్లో 42.2 శాతం మంది మద్యం సేవిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ 38.3 శాతంతో మూడో స్థానంలో, జార్ఖండ్ 33.6 శాతంతో నాలుగో స్థానంలో, మధ్యప్రదేశ్ 26.9 శాతంతో ఐదో స్థానంలో ఉన్నాయి. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో మద్యం వినియోగం గణనీయంగా ఎక్కువగా ఉన్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

### గ్రామాల్లోనే ఎక్కువ

తెలంగాణలో పట్టణ ప్రాంతాల కంటే గ్రామీణ ప్రాంతాల్లో మద్యం వినియోగం అధికంగా ఉంది. పట్టణ ప్రాంతాల్లో 15 ఏళ్లు పైబడిన పురుషుల్లో 36.3 శాతం మంది మద్యం సేవిస్తుండగా.. గ్రామీణ ప్రాంతాల్లో ఈ సంఖ్య 46.6 శాతంగా నమోదైంది. అంటే పట్టణ ప్రాంతాల కంటే గ్రామీణ ప్రాంతాల్లో మద్యం సేవించే వారి సంఖ్య దాదాపు 10 శాతం ఎక్కువగా ఉంది.

### మహిళల్లోనూ పెరుగుతున్న వినియోగం

మద్యం సేవించడం పురుషులకు మాత్రమే పరిమితం కాలేదని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. తెలంగాణలో మహిళల్లో 7.1 శాతం మంది మద్యం సేవిస్తున్నట్లు నమోదైంది. ఈ విషయంలో రాజస్థాన్ 19.9 శాతంతో మొదటి స్థానంలో ఉండగా.. తెలంగాణ 7.1 శాతంతో రెండో స్థానంలో ఉంది. ఛత్తీస్‌గఢ్‌లో 5.7 శాతం, జార్ఖండ్‌లో 5.5 శాతం, మధ్యప్రదేశ్‌లో 1.6 శాతం మహిళలు మద్యం సేవిస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

### ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం

తెలంగాణలో పురుషుల్లో మద్యం వినియోగం జాతీయ సగటుతో పోలిస్తే చాలా అధికంగా ఉండటం, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వినియోగం మరింత ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. మహిళల్లోనూ మద్యం వినియోగం నమోదవుతుండటం మరో ఆందోళనకర పరిణామంగా మారింది. అధిక మద్యపానం ఆరోగ్యంతో పాటు కుటుంబ ఆర్థిక పరిస్థితులు, సామాజిక జీవనంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మద్యం వినియోగాన్ని నియంత్రించేందుకు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంతో పాటు ఆరోగ్య పరిరక్షణ చర్యలను మరింతగా చేపట్టాల్సిన అవసరం ఉంది.

# గోషామహల్‌లో ముస్లిం ఓట్ల తొలగింపునకు కుట్ర: అసదుద్దీన్ ఒవైసీ

**జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబర్ 6:**

గోషామహల్ నియోజకవర్గంలో ముస్లిం ఓటర్ల పేర్లను ఓటర్ల జాబితా నుంచి ఉద్దేశపూర్వకంగా తొలగించేందుకు కుట్ర జరుగుతోందని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర ఆరోపణలు చేశారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియలో భాగంగా బల్క్ దరఖాస్తుల ద్వారా ఈ ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, గోషామహల్‌లోని బూత్ నంబర్ 28, 30, 127లో ముస్లిం ఓటర్ల పేర్లను తొలగించేందుకు ముందుగానే ప్రింట్ చేసిన ఫారం–7 దరఖాస్తులను సమర్పిస్తున్నారని ఆరోపించారు. ఈ ఓటర్లందరి పేర్లు కనీసం 2002 నుంచి జాబితాలో ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. ఒకే వ్యక్తి 122 దరఖాస్తులు ఎలా సమర్పిస్తారని ఆయన ప్రశ్నించారు. ఈ కుట్ర వెనుక బీజేపీ నాయకులు ఉన్నారని ఒవైసీ ఆరోపించారు. బల్క్‌గా, తప్పుడు ఫారం–7 దరఖాస్తులు దాఖలు చేస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని ఒవైసీ డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం స్వతంత్రంగా పనిచేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామక ప్రక్రియను పాత పద్ధతిలోనే జరపాలని ఆయన డిమాండ్ చేశారు.



# రూ.80కి చేరిన సన్నబియ్యం

- మొదటి పేజీ తరువాయి..



మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో భారీగా గిరాకీ ఉండటంతో సమస్య మరింత తీవ్రమవుతోంది. కోతలు ప్రారంభం కాగానే పొరుగు రాష్ట్రాల వ్యాపారులు పచ్చి ధాన్యాన్ని పెద్దఎత్తున కొనుగోలు చేసి ముంబై, బెంగళూరు, చెన్నై వంటి నగరాలకు తరలిస్తున్నారు. దీంతో తెలంగాణలో స్థానికంగా సన్నధాన్యం కొరత ఏర్పడుతోంది. ధాన్యం లభ్యత తగ్గడంతో మిల్లర్లు, వ్యాపారులు ధరలను పెంచుతున్నట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. గతంలో మిల్లర్లు వ్యాపారులకు కొంత గడువు ఇచ్చి బియ్యం సరఫరా చేసేవారు. ప్రస్తుతం నగదు చెల్లించిన తర్వాతే బియ్యం ఇస్తుండటంతో చిల్లర వ్యాపారులు కొనుగోలు ధరకు అనుగుణంగా విక్రయ ధరలను పెంచుతున్నారు. ఫలితంగా సన్నబియ్యం ధరలు సామాన్యుడికి అందనంత స్థాయికి చేరుతున్నాయి. పౌరసరఫరాల సంస్థ గత ఖరీఫ్‌లో సేకరించిన ధాన్యంలో మిగులు, కస్టమ్ మిల్లింగ్ బియ్యం విషయంలో చోటుచేసుకున్న అక్రమాలు కూడా మార్కెట్‌ను ప్రభావితం చేస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. నిఘా తనిఖీల్లో రూ.2 వేల కోట్ల విలువైన ధాన్యం మాయమైనట్లు తేలినట్లు సమాచారం. కొందరు మిల్లర్లు ప్రభుత్వానికి కేటాయించిన మేలురకం ధాన్యాన్ని ఇతర రాష్ట్రాలకు విక్రయిస్తూ.. నాణ్యత లేని ధాన్యం, రేషన్ బియ్యాన్ని అక్రమంగా మిల్లులకు తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో 25 కిలోల బస్తా లలిత సోనామసూరి బియ్యం కిలో రూ.71.33, కర్నూలు సోనామసూరి కిలో రూ.70, హెచ్ఎంటీ బియ్యం కిలో రూ.69 నుంచి రూ.78 వరకు ధర పలుకుతున్నాయి. పొరుగు రాష్ట్రాల వ్యాపారులు సన్నధాన్యాన్ని విచ్చలవిడిగా కొనుగోలు చేయకుండా ప్రభుత్వం కఠిన ఆంక్షలు విధించాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. బియ్యం అక్రమ నిల్వలు, మిల్లుల్లో అక్రమ పునర్వినియోగంపై నిఘా అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టాలని సూచిస్తున్నారు. ధాన్యం కేటాయింపుల సమయంలో మిల్లుల సామర్థ్యం, ఖాళీ నిల్వ సామర్థ్యాన్ని కచ్చితంగా పరిగణనలోకి తీసుకోవాలని కోరుతున్నారు. రేషన్ సన్నబియ్యంలో నూకల శాతాన్ని తగ్గించడం ద్వారా అక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ఇదిలా ఉండగా.. ఒకవైపు సంక్షేమ పథకాల అమలు, మరోవైపు రూ.65 వేల కోట్లకు పైగా పేరుకుపోయిన సేవలు, అభివృద్ధి పనుల బకాయిలను సమతుల్యం చేయడం ప్రభుత్వానికి సవాలుగా మారింది. పన్నేతర ఆదాయాన్ని పెంచుకోవడంతో పాటు ప్రాధాన్యతా ప్రాజెక్టులను పునఃసమీక్షిస్తూ ఆర్థిక క్రమశిక్షణ పాటించాల్సిన అవసరం ఉందని ఆర్థిక విశ్లేషకులు సూచిస్తున్నారు.

# కాంగ్రెస్‌లో కొత్త కుర్చీలాటకు తెరలేపుతున్నారా?

**జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబర్ 6:**

తెలంగాణ కాంగ్రెస్‌లో బీసీ ముఖ్యమంత్రి నినాదం కొత్త రాజకీయ చర్చకు దారితీస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం కొనసాగుతున్న సమయంలో పార్టీలోని కొందరు నేతలు అకస్మాత్తుగా బీసీ ముఖ్యమంత్రి అంశాన్ని తెరపైకి తీసుకురావడంపై పార్టీ వర్గాల్లోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన సమయంలో ఇలాంటి నినాదాలు పార్టీకి మేలు చేస్తాయా? లేక వర్గపోరును మరింత పెంచుతాయా? అనే చర్చ జరుగుతోంది.



### రేవంత్ నాయకత్వమే ప్రధాన బలం

రేవంత్ రెడ్డి తన రాజకీయ వ్యూహాలతో ప్రతిపక్ష బీఆర్ఎస్‌ను ఎదుర్కొంటూ ప్రభుత్వాన్ని ముందుకు తీసుకెళుతున్నారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఆయన దూకుడు, ప్రజల్లో ఉన్న గుర్తింపు, రాజకీయంగా నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం కాంగ్రెస్‌కు బలంగా మారాయని ఆ పార్టీ నేతలు పేర్కొంటున్నారు. ఇలాంటి సమయంలో ప్రత్యామ్నాయ నాయకత్వం పేరుతో కొత్త చర్చలు ప్రారంభించడం పార్టీకి ఎంతవరకు ప్రయోజనకరమనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### పదవుల కోసం పోటీనా?

బీసీ వర్గానికి చెందిన నాయకులు ముందుగా క్షేత్రస్థాయిలో తమకంటూ ప్రత్యేకమైన ప్రజాదరణ, రాజకీయ బలం పెంచుకోవాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కేవలం పార్టీ పదవులు, అధిష్ఠానం అండతో ఎదిగి ముఖ్యమంత్రి పదవిపై ఆశలు పెట్టుకోవడం రాజకీయంగా ఎంతవరకు సాధ్యమనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ప్రజల్లో విశ్వాసం సంపాదించుకోవడంతో పాటు పార్టీని గెలిపించగల సామర్థ్యాన్ని నిరూపించుకోవడమే నాయకత్వానికి అసలైన కొలమానమని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

### ముందుగా పార్టీ గెలవాలి

తదుపరి ఎన్నికల్లో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావడమే ప్రస్తుత లక్ష్యంగా ఉండాలని పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి. ఎన్నికలకు చాలా ముందుగానే ముఖ్యమంత్రి పదవి, భవిష్యత్ నాయకత్వం వంటి అంశాలపై చర్చలు ప్రారంభిస్తే పార్టీకి నష్టం కలిగే అవకాశం ఉందని అంటున్నారు. పార్టీ గెలుపు కోసం కృషి చేయాల్సిన సమయంలో పదవుల పంపకంపై చర్చలు జరపడం మొదటికే మోసం తెచ్చే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

### వర్గపోరుతో పార్టీకి నష్టమే

రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం కొనసాగుతున్న సమయంలో బీసీ ముఖ్యమంత్రి నినాదం వంటి అంశాలు తెరపైకి రావడం పార్టీలో వర్గ విభేదాలను పెంచే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే నాయకుల మధ్య ఉన్న విభేదాలకు ఇలాంటి నినాదాలు మరింత ఆజ్యం పోస్తే క్షేత్రస్థాయి కార్యకర్తల్లో గందరగోళం ఏర్పడే ప్రమాదం ఉందని పలువురు నేతలు చెబుతున్నారు.

### కార్యకర్తల్లోనూ అసంతృప్తి

ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి పెట్టాల్సిన సమయంలో కుర్చీ కోసం పోటీ పడుతున్నారనే భావన ప్రజల్లోకి వెళ్లకూడదని కాంగ్రెస్ కిందిస్థాయి నాయకులు సూచిస్తున్నారు. పార్టీని బలోపేతం చేయాల్సిన సమయంలో వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాల కోసం కుల సమీకరణాలకు తెరతీయడం పార్టీ భవిష్యత్తుకు మంచిది కాదని కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు.

### అభివృద్ధిపైనే దృష్టి పెట్టాలి

ప్రజలు కోరుకుంటున్న అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించి ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులు కోరుతున్నాయి. అనవసరమైన నాయకత్వ పోటీలు, పదవుల కోసం జరిగే అంతర్గత రాజకీయాలకు దూరంగా ఉంటేనే కాంగ్రెస్‌కు ప్రయోజనం చేకూరుతుందని సూచిస్తున్నారు. పార్టీ ఐక్యతను కాపాడుకుంటూ, ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరించడంపైనే నాయకత్వం దృష్టి పెట్టాలని కిందిస్థాయి క్యాడర్ నుంచి సూచనలు వస్తున్నాయి.

# మాజీ మావోయిస్టులను తమ పార్టీలోకి ఆహ్వానించిన కవిత

**జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబర్ 6:**

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఈరోజు వేములవాడలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జనజీవన స్రవంతిలో కలిసిన మాజీ మావోయిస్టులు ప్రజాసేవ చేసేందుకు తమ పార్టీలో చేరాలని ఆహ్వానించారు. వారి రాకతో తమ పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. పర్యటనలో భాగంగా, వేములవాడ రాజన్న ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను కవిత పరిశీలించారు. ఆలయ పునర్నిర్మాణంలో కాంక్రీట్ వాడటాన్ని ఆమె తీవ్రంగా వ్యతిరేకించారు. ఆగమశాస్త్రం ప్రకారం కృష్ణశిలలతో నిర్మిస్తేనే ఆలయం వందల ఏళ్లపాటు నిలుస్తుందని, చారిత్రక వారసత్వాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. భక్తులు సమర్పించిన గోవులు సరైన మేత, నీరు లేక మరణిస్తున్నాయని, వాటికి కనీసం హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు కూడా జరపడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "అడవిని వదిలేసి వచ్చిన మాజీ మావోయిస్టులు ప్రజా జీవితంలోకి రండి.. మా పార్టీ మీకు మంచి ప్లాట్‌ఫామ్" అని కవిత పిలుపునిచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుసంధానంగా సిరిసిల్ల–వేములవాడ ప్రాంతంలో సాగునీటి పనులు చేపట్టాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం దిశానిర్దేశం కోల్పోయిందని, అందుకే ప్రజలు తమలాంటి కొత్త పార్టీల వైపు చూస్తున్నారని విమర్శించారు. అంతకుముందు, ఆమె శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# సింగరేణి కార్మికులకు పండగ కానుక.. ఒక్కొక్కరికి రూ.1.10 లక్షల బోనస్

**జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబర్ 6:**

సింగరేణి కార్మికులకు కేంద్ర ప్రభుత్వం పండగ కానుక ప్రకటించింది. రానున్న దసరా, దీపావళి పర్వదినాలను పురస్కరించుకుని, ఒక్కో కార్మికుడికి రూ.1,10,250 చొప్పున బోనస్ ఇవ్వాలని నిర్ణయించినట్లు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా ఈ కీలక ప్రకటన చేశారు. ఈ వార్తతో సింగరేణి కార్మిక కుటుంబాల్లో పండగ వాతావరణం నెలకొంది. దేశానికి వెలుగులు పంచేందుకు కార్మికులు పగలు, రాత్రి పడుతున్న శ్రమ వెలకట్టలేనిదని కిషన్ రెడ్డి కొనియాడారు. సింగరేణి కేవలం బొగ్గు ఉత్పత్తి సంస్థ మాత్రమే కాదని, తెలంగాణ రాష్ట్రానికి 'కొంగు బంగారం' లాంటిదని ఆయన అభివర్ణించారు. లక్షలాది కుటుంబాలకు జీవనాధారంగా ఉన్న ఈ సంస్థ, దేశ, రాష్ట్ర అభివృద్ధిలో కీలక భాగస్వామి అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు దసరా, దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. బోనస్ ప్రకటనతో పాటు, కిషన్ రెడ్డి పలు కీలక సూచనలు, విజ్ఞప్తులు చేశారు. సింగరేణి భవిష్యత్తు, కార్మికుల సంక్షేమం కోసం యాజమాన్యం, కార్మికులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని బొగ్గు ఉత్పత్తిని మరింత పెంచేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అదే సమయంలో సింగరేణి సంస్థకు తెలంగాణ ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.60,000 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ నిధులు సంస్థ అభివృద్ధికి, విస్తరణకు దోహదపడతాయని పేర్కొన్నారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) అత్యంత కీలక పాత్ర పోషిస్తోంది. ప్రస్తుతం ఈ సంస్థలో సుమారు 42,000 మందికి పైగా రెగ్యులర్ ఉద్యోగులు పనిచేస్తుండగా.. వేలాది మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ఉపాధి పొందుతున్నారు. గోదావరి లోయ పరిధిలోని ఓపెన్‌కాస్ట్, అండర్‌గ్రౌండ్ గనుల ద్వారా సింగరేణి ఏటా సగటున 67 నుంచి 70 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేస్తోంది.

# జీహెచ్ఎంసీ కమిషనర్‌కు హైకోర్టు నోటీసులు.

**జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబర్ 6:** గాంధీ జయంతి సందర్భంగా నగరంలో మాంసం దుకాణాలను మూసివేయాలని ఆదేశాలు జారీ చేసినందుకు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌కు తెలంగాణ హైకోర్టు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. ఫిబ్రవరిలో కోర్టు ఇచ్చిన ఆదేశాలకు విరుద్ధంగా ప్రవర్తించారంటూ దాఖలైన పిటిషన్‌పై నిన్న విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ శ్రవణ్ కుమార్ ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చారు. తార్నాకకు చెందిన న్యాయ విద్యార్థి వడ్ల శ్రీకాంత్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. గతంలో ఇలాంటి ఉత్తర్వులపై శ్రీకాంత్ కోర్టును ఆశ్రయించగా, ఈ ఏడాది ఫిబ్రవరిలో హైకోర్టు కీలక ఆదేశాలిచ్చింది. స్లాటర్‌హౌస్‌లు, మాంసం దుకాణాల మూసివేతకు సంబంధించిన ఏ ఉత్తర్వులైనా జీహెచ్ఎంసీ చట్టం–1955 నిబంధనలకు అనుగుణంగానే ఉండాలని స్పష్టం చేసిందని పిటిషనర్ తరఫు న్యాయవాది విజయ్ గోపాల్ కోర్టుకు వివరించారు. అయితే, ఆ ఉత్తర్వులను పట్టించుకోకుండా అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా స్లాటర్‌హౌస్‌లు, రిటైల్ మాంసం, బీఫ్ దుకాణాలను మూసివేయాలని సెప్టెంబర్ 30న జీహెచ్ఎంసీ పత్రికా ప్రకటన విడుదల చేసిందని ఆయన వాదించారు. జీహెచ్ఎంసీ చట్టం ప్రకారం రూపొందించిన నిబంధనలను గెజిట్‌లో ప్రచురించకుండా ఈ నిర్ణయం తీసుకోవడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. మాంసం దుకాణాల మూసివేత వ్యాపారుల ప్రాథమిక హక్కులను (ఆర్టికల్ 19(1)(g)) ఉల్లంఘిస్తుందని తెలిపారు. కోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ధిక్కరించిన కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని, ఆయనకు రూ.50,000 జరిమానా విధించాలని పిటిషన్‌లో కోరారు. వాదనలు విన్న న్యాయస్థానం, కమిషనర్‌కు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను వచ్చేనెల 2వ తేదీకి వాయిదా వేసింది.

# 4 లక్షలు తీసుకుంటూ ఒకరు.. లక్ష తీసుకుంటూ మరొకరు.

**జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబర్ 6:**

అవినీతిపై ఉక్కుపాదం మోపుతున్న తెలంగాణ ఏసీబీ అధికారులు సోమవారం వేర్వేరు ప్రాంతాల్లో జరిపిన దాడుల్లో ఇద్దరు మహిళా ప్రభుత్వ అధికారులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌వో స్వర్ణకుమారి, జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ తులసీరామ్ సునీత లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్న స్వర్ణకుమారి ఎల్‌బీనగర్‌లో అనుమతి లేకుండా నడుస్తున్న ఓ ఫిజియోథెరపీ కేంద్రంపై చర్యలు తీసుకోకుండా ఉండేందుకు, కొత్త లైసెన్స్ ఇచ్చేందుకు రూ.2 లక్షలు లంచం డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా హెల్త్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ద్వారా రూ. లక్షను స్వీకరించి, తన ప్రైవేట్ డ్రైవర్ మద్దూరి కృష్ణయ్యకు అప్పగించారు. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు, డబ్బుతో వెళ్తున్న కృష్ణయ్యను పట్టుకున్నారు. అనంతరం స్వర్ణకుమారి నివాసం, కార్యాలయంలో సోదాలు జరిపి కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో స్వర్ణకుమారితో పాటు శ్రీనివాస్, కృష్ణయ్యను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరో ఘటనలో, జీహెచ్ఎంసీ మెహిదీపట్నం జోన్‌లో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న తులసీరామ్ సునీత, నిర్మాణ అనుమతుల కోసం ఓ వ్యక్తి నుంచి రూ.8 లక్షలు డిమాండ్ చేశారు. ముందుగా రూ.4 లక్షలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద లెక్కల్లో చూపని మరో రూ.2.50 లక్షల నగదును కూడా గుర్తించి, మొత్తం రూ.6.5 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆమెను అరెస్టు చేసి, నివాసంలో సోదాలు నిర్వహించారు. ఈ రెండు ఘటనలపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.





PRGI NO:TGTEL/26/A0383
దినపత్రిక జనం వాయిస్
తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM

# ఆదర్శ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

## మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**జనం వాయిస్, సుల్తానాబాద్, అక్టోబర్ 06:**





ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని రకాల మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలోని తెలంగాణ మోడల్ స్కూల్, కళాశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న వసతులు, బాలికల హాస్టల్, విద్యుత్ వ్యవస్థ, పాఠశాల పరిసరాలు, క్రీడా మైదానాన్ని పరిశీలించారు. బాలికల హాస్టల్‌లో కొన్ని గదులకు తలుపులు సరిగా లేకపోవడం, విద్యుత్ వైరింగ్‌కు సంబంధించిన సమస్యలను గుర్తించిన కలెక్టర్ వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అవసరమైన మరమ్మతు పనులకు అమ్మ ఆదర్శ పాఠశాల గ్రాంట్ ద్వారా నిధులు అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులు క్రీడల్లో చురుకుగా పాల్గొనేలా క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేయాలని, అవసరమైన భూమి చదును పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు లేకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని ఆదేశించారు. గత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో వందశాతం ఫలితాలు సాధించడంతో పాటు ఇంటర్మీడియట్‌లో జిల్లా స్థాయిలో మెరుగైన ఫలితాలు సాధించినందుకు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. పాఠశాల, బాలికల హాస్టల్‌లో మౌలిక వసతులపై నిరంతరం పర్యవేక్షణ చేస్తూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ తనిఖీలో తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ గోల్డీ బుల్బీ కౌర్, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

# రాష్ట్ర స్థాయి పోటీలకు మేరీ మీడియాట్రిక్స్ విద్యార్థులు

## టెన్నిస్, కరాటేలో ప్రతిభ చాటిన విద్యార్థులు

**జనం వాయిస్, మంథని, అక్టోబర్ 6:**





మంథని మండలం సూరయ్యపల్లిలోని మేరీ మీడియాట్రిక్స్ ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడారంగంలో సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వివిధ క్రీడా విభాగాల్లో అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికై పాఠశాలకు, మంథని ప్రాంతానికి గర్వకారణంగా నిలిచారు. అండర్--14 విభాగంలో ఆరో తరగతి విద్యార్థులు మాన్విక్, వర్షిత్ టెన్నిస్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. క్రమశిక్షణ, పట్టుదలతో సాధన చేస్తూ రాష్ట్ర స్థాయికి చేరుకోవడం పట్ల పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. అదే పాఠశాలకు చెందిన ఆరో తరగతి విద్యార్థి నిక్షేప్ సాయి షోటోకాన్ కరాటేలో అండర్--17 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. కరాటేలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం పట్ల పాఠశాల యాజమాన్యం అభినందనలు తెలిపింది. విద్యార్థుల ప్రతిభను గుర్తించిన పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ సుని సెబాస్టిన్, ఉపాధ్యాయులు, సిబ్బంది వారిని అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజయాలు సాధించి పాఠశాలకు, మంథని ప్రాంతానికి మరింత మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# సీనియర్ సిటిజన్లకు ఉచిత బస్సు పాస్‌లు వెంటనే అమలు చేయాలి.

- మంత్రి పొన్నం ప్రకటనను స్వాగతిస్తున్నాం.
- దసరా కానుకగా 60 ఏళ్లు నిండిన వారందరికీ పాస్‌లు ఇవ్వాలి.

**జనం వాయిస్, ఘట్‌కేసర్, అక్టోబర్ 6:**




సీనియర్ సిటిజన్లకు ఉచిత ఆర్టీసీ బస్సు పాస్‌లు అందించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించడాన్ని డెమొక్రటిక్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ స్వాగతించింది. ఈ సౌకర్యాన్ని ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే అమలు చేయాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తోట రంగయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్ ప్రభుత్వాన్ని కోరారు. ఘట్‌కేసర్ సర్కిల్ సుప్రభాత్ టౌన్‌షిప్‌లో నిర్వహించిన అసోసియేషన్ సమావేశంలో వారు మాట్లాడుతూ.. 60 సంవత్సరాలు నిండిన ప్రతి సీనియర్ సిటిజన్‌కు ఎలాంటి వివక్ష లేకుండా ఉచిత బస్ పాస్ అందించాలని డిమాండ్ చేశారు. అక్టోబర్ 1 నుంచి 4వ తేదీ మధ్య వివిధ దినపత్రికల్లో ప్రచురితమైన వార్తల ప్రకారం, సీనియర్ సిటిజన్లకు ఉచిత బస్ పాస్‌లు అందించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారని తెలిపారు. వృద్ధాప్యంలో వైద్య సేవలు, మందులు, పెన్షన్, బ్యాంకు పనులు, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లడం వంటి అవసరాల కోసం సీనియర్ సిటిజన్లు తరచూ ప్రయాణించాల్సి వస్తుందని పేర్కొన్నారు. పెరుగుతున్న జీవన వ్యయాల నేపథ్యంలో బస్సు చార్జీలు కూడా వృద్ధులకు అదనపు ఆర్థిక భారంగా మారుతున్నాయని తెలిపారు. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతోపాటు లగ్జరీ, రాజధాని, గరుడ తదితర బస్సుల్లో 50 శాతం రాయితీ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్న తరహాలోనే, సమాజానికి జీవితాంతం సేవలందించిన వృద్ధులకు కూడా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం ప్రభుత్వ సామాజిక బాధ్యతగా భావించాలని కోరారు. మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా ఈ అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ప్రకటించడం సీనియర్ సిటిజన్లకు ఆశాజనకంగా ఉందని వారు అన్నారు. ఇది కేవలం రవాణా సౌకర్యం మాత్రమే కాకుండా వృద్ధుల పట్ల ప్రభుత్వ గౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇక ఆలస్యం చేయకుండా 60 ఏళ్లు నిండిన సీనియర్ సిటిజన్లందరికీ దసరా కానుకగా ఉచిత ఆర్టీసీ బస్ పాస్‌లు ప్రకటించి, అమలు తేదీని స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు రాజిరెడ్డి, ఎస్.లక్ష్మీనారాయణ, ఎం.సత్యనారాయణ, బంగారి మల్లయ్య, రాసకట్ల పోశం, కొట్టే మల్లయ్య, ఏ.ప్రభాకర్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భూ-భారతి రీ-సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం.

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష.**
**తొలి దశలో 70 గ్రామాల్లో రీ-సర్వే.**
**సర్వే అనంతరం 21 రోజులు అభ్యంతరాల స్వీకరణ.**



**జనం వాయిస్, ఓదెల, అక్టోబర్ 6:**

భూ-భారతి రీ-సర్వే ద్వారా భూముల హద్దులను ఖచ్చితంగా నిర్ధారించి, సమగ్ర భూ రికార్డులను రూపొందించనున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. రైతులు, ప్రజలు రీ-సర్వేకు అధికారులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. మంగళవారం ఓదెల మండలం ఇందుర్తి గ్రామంలో నిర్వహించిన భూ-భారతి రీ-సర్వే అవగాహన సమావేశంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో 1937లో చివరిసారిగా భూ సర్వే జరిగిందని, అనంతరం భూముల కొనుగోళ్లు, అమ్మకాలు, వారసత్వ బదలాయింపులతో హద్దులు, విస్తీర్ణాలకు సంబంధించి సమస్యలు ఏర్పడ్డాయని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భూములను సర్వే చేసి ఖచ్చితమైన రికార్డులు రూపొందిస్తామన్నారు. పెద్దపల్లి జిల్లాలోని 190 రెవెన్యూ గ్రామాల్లో తొలి దశలో 70 గ్రామాలను రీ-సర్వేకు ఎంపిక చేసినట్లు చెప్పారు. రీ-సర్వే పూర్తయిన తర్వాత భూ వివరాలను ప్రజల పరిశీలనకు ఉంచి 21 రోజుల పాటు అభ్యంతరాలు స్వీకరిస్తామని తెలిపారు. అభ్యంతరాల పరిష్కారం అనంతరం తుది భూ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి భూధార్ కార్డులు జారీ చేస్తామన్నారు. రైతులు తమ భూములకు సంబంధించిన పత్రాలతో అందుబాటులో ఉండి సర్వే సిబ్బందికి సహకరించాలని కలెక్టర్ కోరారు.



# మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్‌ను నిర్మించుకోవాలి

- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్.
- కళాశాలల్లో 'నషా ముక్త్ భారత్' అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేయాలి.
- సింగరేణి ప్రాంతాల్లోనూ మాదకద్రవ్యాలపై చైతన్యం కల్పించాలి.

**జనం వాయిస్, ధర్మారం, అక్టోబర్ 6:**





యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్‌ను నిర్మించుకోవాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గంజాయి, మాదకద్రవ్యాలకు యువత ఆకర్షితులు కాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీసులు, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ధర్మారం మండలం బొమ్మారెడ్డిపల్లిలోని మహేశ్వర ఫంక్షన్ హాల్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మిషన్ పరివర్తన' మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, డీసీపీ రామ్ రెడ్డితో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలల్లో 'నషా ముక్త్ భారత్' కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. సింగరేణి ప్రాంతాల్లోనూ పెద్ద ఎత్తున చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సరదా కోసం కూడా మాదకద్రవ్యాలను ప్రయత్నించవద్దని యువతకు హితవు పలికారు. ఎవరైనా డ్రగ్స్, గంజాయి ప్రభావానికి గురైనట్లు గుర్తిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని, వారికి తక్షణమే వ్యసన విముక్తి చికిత్స అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ 'మిషన్ పరివర్తన' వంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించి యువతలో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. డీసీపీ రామ్ రెడ్డి మాట్లాడుతూ మాదకద్రవ్యాల విక్రయాలు, గంజాయి అక్రమ రవాణాపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందన్నారు. యువత క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని తమ ప్రతిభను పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం మంత్రి, కలెక్టర్, డీసీపీ, పోలీస్ అధికారులు, యువత, ప్రజలు మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ కృష్ణ, పోలీస్ అధికారులు, సిబ్బంది, యువత, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# లక్షలో ఒకరికి మాత్రమే కనిపించే అరుదైన మోకాలి సమస్యకు చికిత్స.

**జనం వాయిస్, పెద్దపల్లి, అక్టోబర్ 6:**

పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో పుట్టుకతో వచ్చే అరుదైన మోకాలి సమస్యతో జన్మించిన శిశువుకు వైద్యులు విజయవంతంగా చికిత్స అందించారు. పాలకుర్తి మండలం జీడీనగర్‌కు చెందిన గీతకు జన్మించిన శిశువులో ఈ సమస్యను పుట్టిన వెంటనే వైద్యులు గుర్తించారు. వైద్య పరిభాషలో కంజెనిటల్ నీ డిస్లోకేషన్ (జెనూ రికర్వేటమ్ కంజెనిటమ్) గా పిలిచే ఈ సమస్యలో శిశువు మోకాలు సాధారణ దిశకు విరుద్ధంగా వెనక్కి వంగి ఉంటాయి. ఈ సమస్య సుమారు లక్ష మందిలో ఒకరికి మాత్రమే కనిపించే అరుదైన పరిస్థితిగా వైద్యులు తెలిపారు.

### సకాలంలో గుర్తించి చికిత్స

శిశువు జన్మించిన వెంటనే సమస్యను గుర్తించిన పిల్లల వైద్యులు, ఎముకలు--కీళ్ల వైద్యులను సంప్రదించారు. ఇరు విభాగాల వైద్యులు శిశువును పరీక్షించి, అవసరమైన చికిత్సను ప్రారంభించారు.

### రెండు విభాగాల సమన్వయంతో విజయవంతం



డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో పిల్లల వైద్య విభాగం, ఎముకలు--కీళ్ల వైద్య విభాగం సమన్వయంతో పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలోనే శిశువుకు విజయవంతంగా చికిత్స అందించారు. ప్రస్తుతం శిశువు ఆరోగ్య పరిస్థితి సంతృప్తికరంగా ఉందని వైద్యులు తెలిపారు. పుట్టుకతో వచ్చే ఇటువంటి సమస్యలను వీలైనంత త్వరగా గుర్తించి సరైన చికిత్స అందించడం ద్వారా భవిష్యత్తులో మోకాలి కదలికలు, నడకలో ఇబ్బందులు తలెత్తకుండా నివారించవచ్చని వైద్యులు పేర్కొన్నారు. అరుదైన సమస్యను సకాలంలో గుర్తించి, జిల్లా ఆసుపత్రిలోనే సమన్వయంతో విజయవంతంగా చికిత్స అందించడం విశేషమని తెలిపారు.

# జాతీయ స్థాయిలో కోటారి శ్రీనివాస్‌కు డబుల్ ధమాకా

- ఉత్తమ ఏఐ ఎడిటర్, ఉత్తమ వెడ్డింగ్ వీడియోగ్రఫీ పురస్కారాలు కైవసం.
- భారత్ కళా పురస్కార్-2026తో మరో అరుదైన గౌరవం.

**జనం వాయిస్, మంథని, అక్టోబర్ 6:**







ఫొటోగ్రఫీ రంగంలో తనదైన ప్రతిభను చాటుకుంటూ, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని ఏఐ ఎడిటింగ్, వెడ్డింగ్ వీడియోగ్రఫీలో సేవలందిస్తున్న పెద్దపల్లి జిల్లా మంథని మండలం అడవిసోమనపల్లికి చెందిన ఫొటోగ్రాఫర్ కోటారి శ్రీనివాస్‌కు జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. ఒకేసారి రెండు ప్రతిష్ఠాత్మక అవార్డులను అందుకుని మంథని ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. హైదరాబాద్ శంషాబాద్‌లోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్‌లో ఈ నెల 2, 3, 4 తేదీల్లో నిర్వహించిన ఫొటో ట్రేడ్ షోలో భాగంగా జాతీయ స్థాయి భారత్ కళా పురస్కార్--2026 వెడ్డింగ్ ఫొటోగ్రఫీ, ఏఐ ఎడిటర్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన కోటారి శ్రీనివాస్ ఉత్తమ ఏఐ ఎడిటర్, ఉత్తమ వెడ్డింగ్ వీడియోగ్రఫీ అవార్డులను నిర్వాహకుల చేతుల మీదుగా అందుకున్నారు.

### ప్రతిభకు దక్కిన రెండు ప్రతిష్ఠాత్మక పురస్కారాలు

ఫొటోగ్రఫీతో పాటు ఏఐ ఆధారిత ఎడిటింగ్, వెడ్డింగ్ వీడియోగ్రఫీలో శ్రీనివాస్ అందిస్తున్న సేవలను గుర్తించిన నిర్వాహకులు ఆయనను రెండు ప్రతిష్ఠాత్మక పురస్కారాలకు ఎంపిక చేశారు. ఫొటోగ్రఫీ పరిశ్రమకు చెందిన ప్రముఖులు, కార్యక్రమ నిర్వాహకులు, సినీ నటుల చేతుల మీదుగా ఆయన అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఉత్తమ వెడ్డింగ్ వీడియోగ్రఫీ, ఏఐ ఎడిటర్ అవార్డులు అందుకోవడం తనకు ఎంతో ప్రత్యేకమైన విషయమని తెలిపారు. తన ప్రతిభను గుర్తించి పురస్కారాలతో సత్కరించిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. తన ఫొటోగ్రఫీ ప్రయాణంలో ప్రోత్సాహం, సహకారం అందిస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిగ్మా ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా చైర్మన్ ఎం.సి. శేఖర్, ట్రేడ్ షో నిర్వాహకులు ఎడిట్ పాయింట్ రమేష్, ఫొటోటెక్ అధినేత అభిమన్యురెడ్డి, తెలంగాణ మాజీ ఫొటోగ్రఫీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, సినీ నటులు తదితరులతో పాటు దేశవ్యాప్తంగా వేలాది మంది ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

# మంథని మున్సిపాలిటీ అఖిల భారత యాదవ సంఘం కమిటీ ఎన్నిక 8న.

**జనం వాయిస్, మంథని, అక్టోబర్ 6:**



అఖిల భారత యాదవ సంఘం మంథని మున్సిపాలిటీ కమిటీ ఎన్నిక ఈ నెల 8న గురువారం నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షులు మోహన్ యాదవ్, వేముల లక్ష్మయ్య యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. మంథని పట్టణంలోని రెడ్డి బాంక్వెట్ హాల్ లో ఉదయం 10 గంటలకు ఈ సమావేశం నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. నూతన మున్సిపల్ కమిటీ ఎన్నికతో పాటు సంఘం బలోపేతంపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికకు మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన యాదవ సంఘం కుల బాంధవులు, మంథని పట్టణంలోని యాదవ బంధువులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమానికి యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల మల్లేశం యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేందర్ యాదవులు పాల్గొనున్నట్లు వారు తెలిపారు.

